




# కరపత్రం

SINCE 2014

ఆదివారం సెప్టెంబర్ 06, 2026 | సంపుటి : 2 | సంచిక : 326 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## కల్వకుంట్ల కుటుంబమా..
# కాసోక్కండి

## బీఆర్ఎస్ తెలంగాణను బందిపోట్లలా దోచుకుంది

- బీఆర్ఎస్ ఎగవేసిన ?36 వేల కోట్లు రైతులకు వేశాం
- ఏడాదిలో 70 వేల ఉద్యోగాల భర్తీ
- 1.06 కోట్ల రేషన్ కార్డులు ఇచ్చాం
- 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ
- రేవంత్ ఉన్నంతకాలం బీఆర్ఎస్ ఎదగనివ్వం
- కేసీఆర్ అసెంబ్లీకి రావాలి.. లేదంటే రాజీనామా చేయాలి
- గజ్వేల్‌లో తేల్చుకుందాం: సీఎం సవాల్
- సిరిసిల్ల, సిద్ధిపేటలో కాంగ్రెస్ గెలుస్తుంది
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 90--117 సీట్లు: రేవంత్



**నకిరేకల్:**
బీఆర్ఎస్ అన్ని రకాలుగా రాష్ట్రాన్ని ముంచి గద్దె దిగిపోయిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారి చరిత్రను ప్రజలు గమనించాలని కోరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. 100 పడకల ఆస్పత్రిని సీఎం ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు**
"బీఆర్ఎస్ నేతలు తెలంగాణను బందిపోటుల్లా దోచుకున్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు అనేక రకాలుగా మోసపోయారు. చివరి విడత రైతు భరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారు. బీఆర్ఎస్ ఎగవేసిన రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. మా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. నల్గొండ జిల్లాకు మూడు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చాం. కేసీఆర్ సీఎం అయితే వారి కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారు. మా ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 1.06 కోట్ల రేషన్‌కార్డులు ఇచ్చాం. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. బీఆర్ఎస్ కార్యకర్తలకూ వాటిని అందిస్తున్నాం. వారి ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా?మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు తీసుకోలేదా?పేదలకు సహాయం చేసినందుకు ఇందిరమ్మ పాలన పోవాలా?"

**కేసీఆర్ సభకు రావాలి.. లేదంటే రాజీనామా చేయాలి**
"సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు.

2 లో




## 'ధురంధర్' కాకపోయినా.. 'ధూమ్' మచాయా హై: మోదీ

- జెన్ జీని ఆకట్టుకున్న మోదీ స్పీచ్
- ఎస్ఆర్‌సీసీ పూర్వ విద్యార్థులు ప్రత్యేకం
- ప్రతి రంగంలో ఎస్ఆర్‌సీసీ ప్రతిభావంతులు
- 2013 ప్రసంగం ఇప్పటికీ ప్రభావం చూపుతోంది
- అప్పుడూ చెప్పింది.. ఇప్పటికీ ఆచరణలో పెట్టా: మోదీ
- దేశం కోసం సంపూర్ణ అంకితభావం
- పాక్ దుస్సాహసానికి సైన్యంతో సమాధానం
- ఉగ్రవాదులపై భారత సైన్యం దూకుడు
- జమ్మూకశ్మీర్ నుంచి ఈశాన్యం వరకు శాంతి
- మావోయిస్టు ఉగ్రవాదం వెన్ను విరిచాం
- భారత్ విధాన చైతన్యంపై ప్రపంచం దృష్టి

**న్యూఢిల్లీ:**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి జెన్ జీని ఆకట్టుకునేలా ప్రసంగించారు. శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది వేడుకల్లో శనివారం మోదీ పాల్గొని మాట్లాడారు. "ధురంధర్ కాకపోయినా, ధూమ్ మాత్రం మచాయా హై" అని అన్నారు. ప్రతి రంగంలోనూ ఎస్ఆర్‌సీసీ పూర్వ విద్యార్థులు తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు "ఎస్ఆర్‌సీసీ పూర్వ విద్యార్థులు కూడా చాలా ప్రత్యేకమైనవారు. మీ భాషలో చెప్పాలంటే, ఇక్కడి పూర్వ విద్యార్థులు ఒరిజినల్ గ్యాంగ్ సభ్యులు. వారు ఎస్ఆర్‌సీసీ పేరును ప్రపంచవ్యాప్తంగా చాటారు. వివిధ రంగాల్లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. మన అరుణ్ జైట్లీ జీ ఇక్కడ చదువుకున్నారు. ఆయనతో జరిగిన సమావేశాల్లో బహుశా ఎస్ఆర్‌సీసీ రోజులకు సంబంధించిన ఒక సంఘటనను చెప్పని సమావేశం ఉండేది కాదు.

2 లో



## జమ్మూకశ్మీర్‌లో లష్కరే కమాండర్ హతం

పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయ్యిబా కమాండర్ ను జమ్మూకశ్మీర్‌లో భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. కొంతకాలంగా ఉగ్రవాది యాసిర్ కదలికలపై నిఘా పెట్టిన భద్రతా బలగాలు శుక్రవారం యూస్‌మార్గ్ లో అతడిని గుర్తించాయి.

2 లో



## కాగితం రంగు మారితే.. ఆహారం నాణ్యత మారినట్టే!

'స్మార్ట్ ఫ్రెష్‌నెస్' స్టిక్కర్‌పై పరిశోధనలు

పాలు, పెరుగు, పనీర్, మాంసం, చేపలు, పండ్లు, వండిన ఆహారం... ఏదైనా సరే నిల్వ ఉండే కొద్దీ వాటిలో జీవ రసాయన మార్పులు జరుగుతాయి. సూక్ష్మజీవులు

## కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే
## విస్తరణపై ఢిల్లీలో చర్చ జరగలేదు




- » ఎప్పుడు విస్తరించాలో సీఎం రేవంత్ ఇష్టమే
- » సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించాం
- » సురేఖ విషయంలో ఏఐసీసీ ఒప్పుకోలేదు
- » సురేఖ, చిన్నారెడ్డి అంశాలపైనే ఢిల్లీలో చర్చ
- » మంత్రి పదవిపై ప్రచారం.. అవన్నీ ఊహాగానాలే
- » రాబోయే 100 రోజులు బీసీ హక్కుల గర్జన
- » కుల సర్వేను శాస్త్రీయంగా నిర్వహించాం
- » బీసీ హక్కుల కోసం ఉద్యమం: మహేష్ గౌడ్
- » బీసీల అంశంపై బీజేపీ నేతలు స్పందించాలి: పొన్నం
- » ఓబీసీల జనాభాను ఎందుకు లెక్కించడం లేదు?

## మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అనుచరులపై అథ్లెట్ ఫిర్యాదు

**హైదరాబాద్:**
మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్‌పై ఆరోపణలు చేసిన అంతర్జాతీయ అథ్లెట్ తక్కళ్లపల్లి ప్రతిభ శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించారు.






## రెవెన్యూ వ్యవస్థ క్షీణించింది: రామచందర్‌రావు

- 22ఏ జాబితాలో లక్షల ఎకరాల భూములు
- భూములు తొలగించాలంటే 30% కమీషన్?
- భూభారతిలో అవినీతి, అక్రమాలు: బీజేపీ ఆరోపణ
- 22ఏ భూములను తక్షణమే తొలగించాలి
- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- లేకుంటే పెద్దఎత్తున ఆందోళన
- కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూదొందే
- కాంగ్రెస్ ప్రజల్లో విశ్వాసం కోల్పోయింది
- తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుంది

2 లో



## ఎవరినిపడితే వారిని భాజపాలోకి చేర్చుకోం: మురళీధర్‌రావు

**హైదరాబాద్:**
మాజీ మంత్రి కొండా సురేఖ (ఖశీఅస్త్రు ాబతీవనిష్ట్రు)ను భాజపాలో చేర్చుకుంటారనే ప్రచారంపై ఆ పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు స్పందించారు. ఎవరినిపడితే వాళ్లను పార్టీలో చేర్చుకోబోమని వ్యాఖ్యానించారు. "కాంగ్రెస్‌లో సంక్షోభం ప్రారంభమైంది. దాన్ని పక్కదారి పట్టించేందుకే ఇలాంటి కథనాలు వస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం భాజపానే" అని మురళీధర్‌రావు అన్నారు.

## భూములు దోచుకోవడానికే 22ఏ: కిషన్‌రెడ్డి

- రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్మడమే
- 60 లక్షల ఎకరాలకు పైగా 22ఏలో పెట్టారు
- అనుమతులున్న భూములకూ 22ఏ సెగ
- 22ఏ పేరుతో ప్రజల భూములపై కన్ను
- కమీషన్ల కోసమే నిషేధిత జాబితా: కిషన్‌రెడ్డి
- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్: కేంద్ర మంత్రి
- రాష్ట్రాన్ని రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చారు
- 22ఏలోని పేదల భూములు తొలగించాలి
- దోచుకున్న ప్రతి రూపాయి వసూలు చేస్తాం
- 22ఏపై ఇంటింటికీ వెళ్లి పోరాటం చేయాలి




**హైదరాబాద్:**
రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్మడమేనని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగానే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సైతం భూములను అమ్మే ప్రయత్నం

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయి: కేటీఆర్



**కరీంనగర్:**
కేసీఆర్ రాజీనామాకు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారని.. తెలంగాణ తెచ్చిన ఆయన రాజీనామా చేయాలా? అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. కరీంనగర్‌లోని డా.బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన యువ సమరభేరీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్నే ప్రజలు బర్తరఫ్ చేసే రోజులు దగ్గరలో ఉన్నాయని పేర్కొన్నారు. "నిరుద్యోగులను కాంగ్రెస్ నిండా ముంచింది. ఈ ప్రభుత్వ పాలనలో విజన్ కాకుండా విధ్వంసమే ఉంది. ఉద్యోగాలు అడిగితే ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నోటిఫికేషన్ గురించి అడిగితే లూటిఫికేషన్ చేస్తున్నారు" అని కేటీఆర్

## తీజ్ వేడుకల వివాదం.. జేఎన్టీయూహెచ్‌లో కర్రలతో దాడులు

- ఇరువర్గాలుగా విడిపోయిన విద్యార్థులు
- పరస్పర దాడులు.. పలువురికి గాయాలు




**హైదరాబాద్:**
జేఎన్టీయూహెచ్‌లో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత విద్యార్థులు రెండు వర్గాలుగా విడిపోయి కర్రలతో కొట్టుకున్నారు. హాస్టల్ గదుల్లో దాక్కున్న విద్యార్థులను తలుపులు విరగ్గొట్టి లోపలికి వెళ్లి దాడి చేశారు. బుధవారం రాత్రి తీజ్ వేడుకల్లో మధ్య తలెత్తిన వివాదంతో విద్యార్థులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఓ విద్యార్థి మరో విద్యార్థిని ప్రవర్తన మార్చుకోవాలని చెప్పడంతో వారిద్దరి మధ్య తోపులాట జరిగింది. వీరికి మిగతా విద్యార్థులు సర్ది చెప్పి పంపించారు.

# భూములు దోచుకోవడానికే 22ఏ: కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి
చేస్తున్నట్లు దుయ్యబట్టారు. నిషేధిత భూసమస్యలపై ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద భాజపా ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. "కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చి దోచుకుంటోంది. భూములు దోచుకోవడానికే 22ఏ తీసుకొచ్చారు. 22ఏ కింద తమ భూములు ఉన్నాయని చాలామందికి తెలియదు. ధరణి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలా దోచుకుందో అందరికీ తెలుసు. రాష్ట్రాన్ని స్థిరాస్తి వ్యాపారంగా మార్చారు. అన్ని రకాల అనుమతులు ఉన్న భూములను 22ఏ జాబితాలో పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్మడమే. భూములు అమ్మకపోతే ప్రభుత్వం నడవలేని పరిస్థితి ఉంది.
వక్ఫ్‌భూములపై తప్ప అన్ని భూములపై సీఎం రేవంత్ కన్నేశారు. రాష్ట్రాన్ని ఆర్ఆర్ రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చారు. ఉద్యోగులకు జీతాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేని పరిస్థితికి తెచ్చారు. 60 లక్షల ఎకరాలకు పైగా భూమిని 22ఏలో పెట్టారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజాస్వామ్యం ఉందా?కాంగ్రెస్ నాయకులను, అధికారులను హెచ్చరిస్తున్నా.. మీరు దోచుకున్న ప్రతి రూపాయి వసూలు చేసి ప్రజలకు పంచుతాం. బీఆర్ఎస్ మాదిరిగా కాంగ్రెస్ కూడా 30 శాతం కమీషన్ అడుగుతోంది. కమీషన్ల కోసమే ప్రజల భూములను నిషేధిత జాబితాలో పెట్టారు. రానున్న రోజుల్లో 22ఏపై ఇంటింటికీ వెళ్లాలి.. రేవంత్ ప్రభుత్వంపై పోరాటం చేయాలి. 22ఏలో పెట్టిన పేదల భూములను తొలగించాలి" అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.
భూభారతి, 22ఏ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడిందని ఆరోపిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ.. "తెలంగాణలోని లక్షలాది ఎకరాల భూమిని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారు. పేద, మధ్యతరగతి ప్రజల భూములను చేర్చడంతో వారు అల్లాడిపోతున్నారు. నిషేధిత జాబితాలో నుంచి భూమి తీసేయాలంటే 30 శాతం కమీషన్ అడుగుతున్నారు. రెవెన్యూ వ్యవస్థ మొత్తం క్షీణించిపోయింది. ఈ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.
కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూదొందే. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబం దోచుకుంది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి బ్రదర్స్ దోచుకుంటున్నారు. 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూములను తక్షణమే తొలగించాలి. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తాం. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయింది. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుంది" అని అన్నారు. నిరసన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య పాల్గొన్నారు.

# కాగితం రంగు మారితే.. ఆహారం నాణ్యత మారినట్టే!

మొదటిపేజీ తరువాయి
పెరగడంతో ప్రొటీన్లు, కొవ్వులు, కార్బోహైడ్రేట్లు విచ్ఛిన్నమవుతాయి. మన కంటితో గుర్తించేసరికి ఆహారం నాణ్యత కోల్పోతుంది. వాటిని తింటే అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. మరి ఆహారం నాణ్యతను గుర్తించేదెలా? దీనికోసం 'స్మార్ట్ ఫ్రెష్‌నెస్' స్టిక్కర్ అందుబాటులోకి వస్తోంది. ఈ సాంకేతికతపై ప్రస్తుతం పరిశోధనలు జరుగుతున్నాయి. ఎర్ర క్యాబేజీ ద్రావణం, వడపోత కాగితం లేదా సెల్యులోజ్ కాగితం ఉంటే చాలు.. ఆహార పదార్థాల నాణ్యతను తెలుసుకునే అవకాశాలున్నాయి.

### ఎలా సాధ్యమంటే...
రైతు బజార్లు, సూపర్‌మార్కెట్లలో ఎర్ర క్యాబేజీ దొరుకుతుంది. దాన్ని శుభ్రంగా కడిగి.. నాలుగైదు పొరలు తీసుకోవాలి. ఒక గిన్నెలో శుద్ధమైన నీరు (డిస్టిల్డ్ వాటర్), సిట్రిక్ ఆమ్లం వేసి కలపాలి. తర్వాత నాలుగు పొరల ఎర్ర క్యాబేజీ ఆకులను వేయాలి. కొద్దిసేపటి తర్వాత ఆ పొరలను తీసేస్తే.. ఆంథోసైనిన్ అనే రసాయనం గిన్నెలో ఉంటుంది. ఈ రసాయనాన్ని ఒక సీసా లేదా గాజు గ్లాసులో నిల్వ చేసుకోవాలి. అనంతరం ఒక సెల్యులోజ్ పేపర్ లేదా బయో డీగ్రేడబుల్ పాలిమర్లను తీసుకుని ఆ రసాయనంలో ముంచాలి. అనంతరం పనీర్ సహా ఆహార పదార్థాలపై పెడితే చాలు. వాటి నాణ్యతను 'స్మార్ట్ ఫ్రెష్‌నెస్' స్టిక్కర్ కొద్ది నిమిషాల్లో చెప్పేస్తుంది. అదెలా అంటే...

తాజాగా ఉన్న పదార్థమైతే... స్టిక్కర్ పసుపు/ఆకుపచ్చ రంగుగా మారుతుంది.
నాణ్యత తగ్గుతున్న దశకు వెళ్తుంటే... స్టిక్కర్ నారింజ/గులాబీ రంగుకు మారుతుది.
పాడవుతున్న స్థితికి చేరుకుంటుంటే.... స్టిక్కర్ ఎరుపు రంగు/ముదురు రంగుకు మారుతుంది.
చైనాలోని పలు రాష్ట్రాల్లో 'స్మార్ట్ ఫ్రెష్‌నెస్' స్టిక్కర్లను వ్యాపారులు వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో వీటిని సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేయడం ద్వారా ఆహార పదార్థాల నాణ్యతను గుర్తించేందుకు వీలుంటుంది. ఈ స్టిక్కర్ ప్రయోజనాలను వంటగదుల్లోకి కూడా తీసుకెళ్లాలని పరిశోధకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

### వ్యర్థాలను తగ్గించడమే లక్ష్యం...
మన ఇంట్లో రెండు, మూడురోజులు నిల్వఉన్న పండ్లు, బ్రెడ్లు, ఆహార పదార్థాలను చాలామంది పారేస్తున్నారు. పండ్లు, బ్రెడ్లు పాడుకావు కదా అని మరికొందరు నాణ్యత లేనివాటిని తింటున్నారు. ఈ రెండిటినీ బ్యాలెన్స్ చేసేందుకు శాస్త్రీయంగా ధ్రువీకరించిన 'స్మార్ట్ ఫ్రెష్‌నెస్' స్టిక్కర్ పనిచేస్తుంది. ఆహారపదార్థాలపై దీన్ని అతికించిన కొద్ది నిమిషాలకే బాగుందా? పాడవబోతుందా?అని చెప్పేస్తుంది. ఆహారం సురక్షితమని తుది నిర్ధారణ చేసే పరికరంగా ఈ స్టిక్కర్‌ను పరిగణించకూడదు. ఒక స్క్రీనింగ్ పరికరంగా మాత్రమే చూడాలి.

# తీజ్ వేడుకల వివాదం.. జేఎన్టీయూహెచ్‌లో కర్రలతో దాడులు

మొదటిపేజీ తరువాయి
ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వా గౌతమి, మంజీరా హాస్టళ్ల వద్ద విద్యార్థులు పెద్ద ఎత్తున చేరి పరస్పర దాడులకు తెగబడ్డారు. దీంతో మిగతా విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ వేరే హాస్టళ్ల గదులకు వెళ్లిపోయారు. వర్సిటీ సిబ్బంది సమాచారంతో కేపీహెచ్‌బీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘర్షణలో గాయపడిన విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఎటువంటి అవాంఛనీయమైన ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘర్షణకు కారకులైన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని జేఎన్టీయూహెచ్ ప్రిన్సిపాల్ జీవీ నరసింహారెడ్డి చెప్పారు.

### విచారణ చేస్తున్నాం: డీసీపీ
జేఎన్టీయూహెచ్‌లో గొడవకు కారణమైన ఇరువర్గాల విద్యార్థులపై కేసులు నమోదు చేయడంతో పాటు పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ తెలిపారు. శుక్రవారం ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. వర్సిటీలో ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్, హాస్టల్ నిర్వాహకులను, ఇతర సిబ్బందితో విచారణ చేపట్టినట్టు తెలిపారు. ర్యాగింగ్ కారణంగా గొడవ జరిగిందనే విషయం వాస్తవం కాదన్నారు.

### కేసులు ఇలా..
కాట్రావత్ నవీన్ నాయక్ ఫిర్యాదు మేరకు రాజు, ఆనంద్, వసంత్, దుర్గా ప్రసాద్, ఆదిత్య, సాగర్‌లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అదే విధంగా వసంత్‌నాయక్ ఫిర్యాదు మేరకు నవీన్ నాయక్, ప్రశాంత్, సందీప్, ఇస్మాయిల్, వెంకట్, చక్రి, సాత్విక్, ప్రకాష్‌లపై కేసులు నమోద య్యాయి. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ప్రశాంత్, సందీప్, పూజిత్, రాజేబ, సన్నీ, ఇస్మాయిల్, ఇమ్మాన్యుయేల్‌లపై కేసులు నమోదు చేశారు.

# 'ధురంధర్' కాకపోయినా.. 'ధూమ్' మచాయీ హై: మోదీ

మొదటిపేజీ తరువాయి
కొన్నిసార్లు నాకు విసుగు వచ్చేది. ఎందుకంటే ఆయన అదే సంఘటనను పదేపదే చెప్పేవారు. ఇప్పటికీ నా బృందంలో ఉన్న సంజీవ్ సన్యాల్ ఎస్ఆర్‌సీసీ పూర్వ విద్యార్థి. ఇక్కడ చదువుకున్న మరెంతో మంది సహచరులు మనతో ఉన్నారు. ఎస్ఆర్‌సీసీ నుంచి ఆర్థిక రంగానికి చెందినవారు మాత్రమే వచ్చినట్లు కాదు. కళాకారుల నుంచి రాజకీయ నాయకులు, న్యాయవాదులు, న్యాయమూర్తుల వరకు ప్రతి రంగానికి చెందినవారు ఇక్కడి నుంచి వెలుగులోకి వచ్చారు.

గత కొన్ని రోజులుగా ఈ కార్యక్రమం గురించి విస్తృతంగా చర్చ జరిగింది. ముఖ్యంగా నా 2013 ప్రసంగం గురించి మాట్లాడుకున్నారు. ప్రజలు దానిని గుర్తు చేసుకున్నారు, మళ్లీ విన్నారు, మళ్లీ చదివారు. కొత్త తరానికి చెందినవారు కూడా దానిని మరోసారి చూసి ఉండవచ్చు. ఒక విధంగా చెప్పాలంటే, ఆ ప్రసంగం ఒక అలను సృష్టించింది. ఒక అల ఉప్పొంగి వెళ్లింది. ఇప్పటికీ, 13-14 ఏళ్ల తర్వాత కూడా, ఆ సమావేశం, ఆ ప్రసంగం ప్రభావం కొనసాగుతోంది" అని అన్నారు.

### 2013లో అలా ఉండేది.. మీకు తెలియదు
గతంలోని విషయాలను నరేంద్ర మోదీ చెప్పారు. "2013లో మీ సీనియర్లు ఇక్కడ కూర్చున్నారు. ఆ సమయంలో నేను ముఖ్యమంత్రిగా ఉన్నాను. అయితే దేశంలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీలో సభ్యుడిగా కూడా ఉన్నాను. అప్పటి కేంద్ర ప్రభుత్వంపై సుదీర్ఘంగా, తీవ్రంగా దాడి చేస్తానని, ఆరోపణల వర్షం కురిపిస్తానని బహుశా ప్రజలు ఆశించి ఉంటారు. కానీ నేను ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ, అప్పటి ప్రభుత్వాన్ని విమర్శించినప్పటికీ, ఆ వేదికను ఆ ఉద్దేశం కోసం ఉపయోగించలేదు.
ఒక దార్శనికతను వివరించాను. సానుకూలంగా మాట్లాడాను. అప్పుడు నేను చెప్పినదంతా నా నమ్మకం. ఆ ఆలోచనలు, కలలను నేను ఎప్పుడూ ఆచరణలో పెట్టాను. ఆ మార్గంలోనే కొనసాగాను. దేశానికి నా సంపూర్ణ అంకితభావాన్ని కొనసాగించాను. దేశం కోసం జీవించాలనే తపనను కలిగి ఉన్నాను. ఆ సమయంలో మీలో చాలామంది పాఠశాలలో ఉండి ఉండవచ్చు. కానీ ఈ రోజు మీరు ఇంటర్నెట్‌లోకి వెళ్లి 2013లో, ఆ కాలానికి సమీపంలోని రోజుల్లో వచ్చిన వార్తలను చదివితే, అప్పటి పరిస్థితి ఎలా ఉండేదో మీకు అర్థమవుతుంది" అని అన్నారు.

### పాకిస్థాన్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే..
ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేస్తున్నవారు ఇప్పుడు వెనుకడుగు వేస్తున్నారని మోదీ అన్నారు. "పాకిస్థాన్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే, భారత సాయుధ దళాలు వారి భూభాగంలోకి ప్రవేశించి దాడి చేస్తున్నాయి. జమ్మూకశ్మీర్ నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు శాంతి పెరిగింది. మావోయిస్టు ఉగ్రవాదం, నక్సలిజం వెన్ను విరిచాం. ఒకప్పుడు భారత విధాన స్తబ్ధత గురించి ఆందోళన చెందిన ప్రపంచం.. ఈ రోజు భారత విధాన చైతన్యం గురించి మాట్లాడుతోంది" అని అన్నారు.

# కాంగ్రెస్‌లో కీలక మార్పులు.. పలు రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జ్‌లు

కాంగ్రెస్ పార్టీ పలు రాష్ట్రాల సంస్థాగత బాధ్యతల్లో కీలక మార్పులు చేసింది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా పీవీ మోహన్, మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా సిరివెళ్ల ప్రసాద్, పంజాబ్ ఇన్‌చార్జ్‌గా సచిన్ పైలట్, అస్సాం ఇన్‌చార్జ్‌గా భూపేష్ బఘేల్, ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జ్‌గా సుఖ్‌దేవ్ భగత్ నియమితులయ్యారు. పంజాబ్‌లో భూపేష్ బఘేల్ స్థానంలో సచిన్ పైలట్‌ను నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది.
సచిన్ పైలట్ రాజస్థాన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత. కేంద్ర మంత్రిగా, రాజస్థాన్ పీసీసీ అధ్యక్షుడిగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా ఉన్న ఆయనకు తాజాగా పంజాబ్ బాధ్యతలు అప్పగించారు.
భూపేష్ బఘేల్ ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పంజాబ్ ఇన్‌చార్జ్‌గా పనిచేసిన ఆయనకు తాజాగా అస్సాం బాధ్యతలు అప్పగించారు. 2026 అస్సాం



అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సీనియర్ పరిశీలకుడిగానూ వ్యవహరించారు.
పీవీ మోహన్ కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ నేత. AICCలో కీలక సంస్థాగత బాధ్యతలు నిర్వహించారు. గతంలో కేరళ, లక్షద్వీప్ వ్యవహారాల బాధ్యతలు చూశారు.
సిరివెళ్ల ప్రసాద్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నేత కాగా, AICC కార్యదర్శిగా జార్ఖండ్ వ్యవహారాల్లో పనిచేశారు.
సుఖ్‌దేవ్ భగత్ ఝార్ఖండ్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత. గతంలో లోక్‌సభ సభ్యుడిగా, ఝార్ఖండ్ పీసీసీ అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా పనిచేశారు. తాజా మార్పుల్లో ఆయనకు ఛత్తీస్‌గఢ్ బాధ్యతలు అప్పగించారు.
ఈ మార్పులతో ఆయా రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత వ్యవహారాలను బలోపేతం చేయడంతో పాటు, స్థానిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు కొత్త నాయకత్వాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దించినట్లైంది.

# సురేఖ ఎపిసోడ్, కేబినెట్ విస్తరణపై మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి
తెలంగాణలో కేబినెట్ విస్తరణ అంశం, కొండా సురేఖ ఎపిసోడ్‌పై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్టు ఆయన చెప్పుకొచ్చారు. అలాగే, కేబినెట్ విస్తరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇష్టానుసారం జరుగుతుందని తెలిపారు.
మీడియా చిట్ చాట్‌లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..'కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే. ఢిల్లీలో కేబినెట్ విస్తరణపై చర్చ జరగలేదు. కేవలం కొండా సురేఖ, చిన్నా రెడ్డి అంశంపై మాత్రమే చర్చ జరిగింది. కేబినెట్ విస్తరణపై హై కమాండ్ నుండి ఎలాంటి సమాచారం లేదు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం. నాకు మంత్రి పదవి అనే ప్రచారంపై నాకు మాత్రం సమాచారం లేదు. అవన్నీ ఊహాగానాలే.
అలాగే, కొండా సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించాం. సురేఖ విషయంలో అందరం మా వంతు ప్రయత్నం చేశాం. సురేఖ విషయంలో ఏఐసీసీ ఒప్పుకోలేదు అంటూ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని రేవంత్ నెరవేర్చారు. కుల సర్వే శాస్త్రీయంగా చేశాం. రాబోయే వంద రోజులు దేశవ్యాప్తంగా బీసీ హక్కుల గర్జన చేస్తాం. బీసీ హక్కుల కోసం జరిగే గర్జనను విజయవంతం చేయండి' అని పిలుపునిచ్చారు.
మరోవైపు.. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బండి సంజయ్, అరవింద్, ఈటల, లక్ష్మణ్ బీసీల అంశంపై స్పందించాలి. అడిగితే పదవులు పోతాయని బీజేపీ బీసీ నేతలు భయపడుతున్నారా?. తెలంగాణలో బీజేపీ ఉండాలా వద్దా తేల్చుకోండి. కుల గణనలో దేశానికి రోల్ మోడల్‌గా ఉన్నాం. తెలంగాణ చేసిన కులగణనలో అన్ని విషయాలు పొందుపరిచాం. మేం పంపిన ఫైల్‌పై కేంద్రం ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. ఓబీసీల జనాభాను ఎందుకు లెక్కించడం లేదు? అని ప్రశ్నించారు.

# కల్వకుంట్ల కుటుంబమా.. కాస్కోండి

మొదటిపేజీ తరువాయి
చదువు లేకపోయినా సంస్కారం ఉంది. అందుకే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని చెల్లిని బయటకు గెంటేశారు. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు.. ఆడబిడ్డను చూసుకోవాలి. మీ సంస్కారం ఏంటో.. నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రండి.. చూసుకుందాం. రాసిపెట్టుకోండి.. మీకు భవిష్యత్ లేదు. మీ బతుకులు చీకటిమయమే. రేవంత్ ఉన్నంతకాలం.. బీఆర్ఎస్ అనే మొక్కను ఎదగనివ్వం. తెలంగాణ తులసి వనంలో గంజాయి మొక్కను పీకుతాం. కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా. వచ్చేసారి సిరిసిల్ల, సిద్దిపేటలోనూ కాంగ్రెస్ గెలుస్తుంది. ఈనెలాఖరుకు సిరిసిల్ల వెళ్తాం. వచ్చేనెల సిద్దిపేటపై దండయాత్ర చేస్తాం. బావ బావమరుదులు ఎవరిని తెచ్చుకుంటారో తెచ్చుకోండి. వచ్చే ఎన్నికల నాటికి సీట్లు పెరిగితే 117, ప్రస్తుతం ఉన్నవే కొనసాగితే 90 స్థానాలతో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే గజ్వేల్‌లోనే తేల్చుకుందాం" అని రేవంత్ సవాల్ విసిరారు.

# మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అనుచరులపై అథ్లెట్ ఫిర్యాదు

మొదటిపేజీ తరువాయి
శ్రీనివాస్ గౌడ్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో తనను ఉద్దేశపూర్వకంగా ట్రోల్ చేస్తూ, కించపరిచేలా పోస్టులు, సందేశాలు పెడుతున్నారని ఆరోపించారు.
తనను అవమానించేలా వ్యాఖ్యలు చేయడంతో పాటు బెదిరించే ధోరణిలోనూ సందేశాలు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు అనంతరం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. ఇటీవల శ్రీనివాస్ గౌడ్‌పై తాను చేసిన ఆరోపణల నేపథ్యంలోనే సోషల్ మీడియాలో తనను లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ చేస్తున్నారని ప్రతిభ ఆరోపించారు.

# జమ్మూకశ్మీర్‌లో లష్కరే కమాండర్ హతం

మొదటిపేజీ తరువాయి
ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో యాసిర్ హతమైనట్లు అధికారులు వెల్లడించారు. శుక్రవారం యూస్‌మార్గ్‌లోని పర్వత ప్రాంతాల్లో గాలింపు చేపట్టిన భద్రతా బలగాలపై ఓ ఉగ్రవాది కాల్పులు జరిపాడు. దీంతో కొనసాగిన ఎదురు కాల్పుల్లో అతడు మరణించాడు. హతమైన ఉగ్రవాదిని యాసిర్‌గా గుర్తించినట్లు శనివారం కశ్మీర్ పోలీసులు వెల్లడించారు. యాసిర్ గతంలో లష్కరే తయ్యిబాకు చెందిన ఓ ఉగ్రముఠాలో సభ్యుడిగా ఉండేవాడు. ఏడాది క్రితం ఆ బృందం నుంచి విడిపోయి, స్వతంత్రంగా ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు లష్కరే ఉగ్రవాదుల తో అతడికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ సమయంలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఉగ్రవాదుల ఫొటోలో యాసిర్ కూడా ఉండడం గమనార్హం. దీంతో కొంత కాలంగా అతడి కదలికలపై భద్రతా బలగాలు నిఘా ఉంచాయి.

### శత్రువులపై నిఘాకు సరికొత్త అస్త్రం
మే 2024లో పూంఛ్‌లో భారత వైమానిక దళం కాన్వాయ్‌పై దాడి.. అదే ఏడాది అక్టోబరులో సోనామార్గ్ సమీపంలో కార్మికులపై దాడి, 2024 డిసెంబర్‌లో బోటా పత్రిలో సైన్యంపై దాడి వంటి ఘటనల్లో అతడి ప్రమేయం ఉంది. పూంఛ్ నుంచి యూస్‌మార్గ్ మీదుగా పుల్వామాలోని పఖేర్‌పోరా వైపు ఉగ్రవాదుల కదలికలు ఉన్నట్లు నిఘా వర్గాలు తెలపడంతో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సైనికాధికారులు వెల్లడించారు. ఉగ్రవాదుల కోసం వారం రోజులుగా మాటువేసినట్లు తెలిపారు. యాసిర్‌తో పాటు మరికొందరు ఉగ్రవాదులు కూడా ఉన్నారని, మిగతా వారికోసం గాలింపు కొనసాగుతోందన్నారు.

# చిన్నారి ఎక్కడ? అని అడిగితే.. భార్యపై భర్త పైశాచికం!




అదనపు కట్నం కోసం వేధిస్తూ.. ఓ భర్త...భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మేడిపల్లి పోలీసులు తెలిపిన మేరకు.. మల్లాపూర్‌కు చెందిన లాలుతో 2023లో చెంగిచెర్లకు చెందిన రత్నావత్ అనిత (21)కు ప్రేమవివాహం జరిగింది.
వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. రెండు నెలలుగా అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో అనిత నెలరోజుల క్రితం ఆర్టీసీ కాలనీలోని తన పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 2న లాలు వచ్చి కుమార్తెను తీసుకెళ్లాడు. మళ్లీ 3న చెంగిచెర్లకు వచ్చాడు. అయితే కూతురిని తీసుకురాలేదు.మనవరాలు ఎక్కడ ఉందని అనిత తండ్రి లాలుని ప్రశ్నించడంతో ఆగ్రహానికి గురై ఇంట్లో ఉన్న పెట్రోల్‌ను అనితపై పోసి నిప్పంటించాడు. కుమార్తెను రక్షించేందుకు అనిత తల్లి ప్రయత్నించే క్రమంలో ఆమెకు కూడా మంటలు అంటుకున్నాయి. బయట ఉన్న అనిత తండ్రి కేకలు విని వెంటనే వచ్చి మంటలను ఆర్పి, అనంతరం 108 వాహనంలో గాంధీ ఆసుపత్రికి తరలించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం సెప్టెంబర్ 06, 2026

# ఇంకా రామగుండం బీఆర్ఎస్ లో గ్రూప్ లే..?

- ఒకటే వార్త.. ఇద్దరి వార్తలు..
- అయోమయంలో కార్యకర్తలు..




కరపత్రం ప్రతినిది ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 05: రామగుండం బీఆర్ఎస్ లో ఇంకా గ్రూపులు కొనసాగుతున్నాయని ప్రజలు, కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. ఇటీవల కేటీఆర్ సమక్షంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్, రాష్ట్ర నాయకులు హరీష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కౌశిక హరి ఒకటయ్యారు. కానీ అది అప్పటి వరకే పరిమితం అయ్యింది అనే సంకేతాలు కార్యకర్తల్లో అయోమయానికి గురిచేస్తున్నాయి. పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ చెప్పిన విధంగా నడుచుకోవాలని కేటీఆర్ సూచించారు. దీంతో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను ఎండగడుతూ అందరూ కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఇలా ఉన్న.. ఒకటే కార్యక్రమాన్ని ఇద్దరు వేరువేరుగా ప్రెస్ నోట్లు పంపిస్తుండడంతో అటు చందర్ వర్గం, ఇటు హరీష్ రెడ్డి వర్గం వేరుగా ఉందా.. అనేది కార్యకర్తల్లో గందరగోళాన్ని నింపుతోంది. ఇంకా పార్టీలో వర్గాలు ఉన్నాయా.. లేక కేటీఆర్ చెప్పారని కలిసి పని చేస్తున్నారా..లేక ఎవరికి వారు యమునా తీరే విధంగా ఉన్నారా అనేది తెలియాల్సింది ఉంది...

# కొత్తపల్లిలో భక్తాంజనేయ స్వామికి వైభవంగా ప్రత్యేక పూజలు

- రెండు వేల అరటి పండ్లతో స్వామివారికి ఆకర్షణీయ అలంకరణ.. భక్తులతో కిటకిటలాడిన ఆలయం

కరపత్రం ప్రతినిది ప్రతినిధి జమ్మికుంట, సెప్టెంబర్ 5: జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో వెలసిన శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బొద్దుల రవీందర్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం కదలి ఫలాలు అంటే అరటి పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు సమర్పించిన సుమారు రెండు వేల అరటి పండ్లను వినియోగించి స్వామివారిని అత్యంత ఆకర్షణీయంగా అలంకరించారు. అరటి పండ్లతో అలంకరించిన స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు రామచందర్‌రావు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల



మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామివారి ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణం హనుమాన్ నామస్మరణతో, భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సకల శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక కొనసాగింది.ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు స్వామివారి అలంకరణకు ఉపయోగించిన ప్రసాదాన్ని అందించారు. భక్తుల సహకారంతో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బొద్దుల రవీందర్ తెలిపారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసం చివరి శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని పేర్కొన్నారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# 18 గ్రామాల్లో ప్రణవ్ బాబు పర్యటన.. 54 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడి

కరపత్రం ప్రతినిది ప్రతినిధి కమలాపూర్, సెప్టెంబర్ 4. హనుమకొండ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 54 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.18 లక్షల విలువైన చెక్కులను హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితల ప్రణవ్ బాబు శుక్రవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిన డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్లతో పాటు అర్హులైన పేదలకు వివిధ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. పేదలు, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.ఆహార భద్రతలో భాగంగా ఆగస్టులో మూడు నెలలకు సరిపడా సన్నబియ్యాన్ని రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు అందించినట్లు పేర్కొన్నారు. ఇటీవల హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన విమర్శలపై స్పందిస్తూ రాజకీయ విమర్శలకు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే సమాధానమని




అన్నారు.ఈ కార్యక్రమంలో కమలాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసాల శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం జాన్సీ రాణి రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేశ్ గౌడ్, పొడేటి బిక్షపతి, కమలాపూర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాట్ల రమేశ్, మౌటం చిరంజీవి, ఆంకార్ అశోక్, మస్నా చంద్రశేఖర్, గంధశ్రీ, అనిల్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సరస్వతీ శిశు మందిర్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




కరపత్రం ప్రతినిది కరీంనగర్
శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.పాఠశాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు, పాటలు తదితర కార్యక్రమాలు నిర్వహించి ఉపాధ్యాయులను సత్కరించారు.పాఠశాల ప్రధానాచార్య మోర రణధీర్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి, నైతిక విలువలను విద్యార్థుల్లో పెంపొందించడమే తమ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ తమ జీవితాలకు దిశానిర్దేశం చేస్తున్న గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులకు సన్మానం చేసి, సర్టిఫికెట్ లు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, అప్పిడి వకుళా దేవి, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, మేచినేని దేవేందర్ రావు, కొత్తూరి ముకుందశీ, కొంజర్ల మహేష్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులల శ్యామ్, గట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

- జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్

కరపత్రం ప్రతినిది కరీంనగర్
ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారుల దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ పిలుపునిచ్చారు.కరీంనగర్‌లో రాష్ట్ర జేఏసీ రూపొందించిన "చలో హైదరాబాద్" పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమానికి సన్నాహకంగా సెప్టెంబర్ 8న కరీంనగర్ టీఎన్జీవోల కమ్యూనిటీ భవనంలో నిర్వహించే ఉమ్మడి జిల్లా స్థాయి సన్నాహక సమావేశానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీం అమలులో అధికారుల నిర్లక్ష్యం కారణంగా



ఆశించిన పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సూచించినప్పటికీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో చిత్తశుద్ధి లోపించిందని అన్నారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వారిలో అసంతృప్తి పెరుగుతోందని తెలిపారు.తాము ప్రభుత్వానికి లేదా ముఖ్యమంత్రికి వ్యతిరేకం కాదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ పాలనను ముందుకు నడిపించే వారే ప్రభుత్వ ఉద్యోగులని స్పష్టం చేశారు. తాము గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, రాజ్యాంగబద్ధంగా, న్యాయబద్ధంగా ఉద్యోగులకు రావాల్సిన హక్కులను మాత్రమే కోరుతున్నామని పేర్కొన్నారు.2004 సెప్టెంబర్ 1 తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారికి అమలవుతున్న సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల భవిష్యత్తును షేర్ మార్కెట్ హెచ్చుతగ్గులకు తాకట్టు పెట్టకుండా, ఉద్యోగులు , ప్రభుత్వం చేస్తున్న పెన్షన్ వాటాలను పెట్టుబడుల నుంచి భద్రంగా వెనక్కి తీసుకువచ్చి ఉద్యోగుల భవిష్యత్తుకు రక్షణ కల్పించాలని కోరారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

- 420 హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు



కరపత్రం ప్రతినిది ప్రతినిధి వేములవాడ
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. శనివారం పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ నుండి చెక్కపల్లి చౌరస్తా తెలంగాణ తల్లి విగ్రహం వరకు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తయినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయి నుంచి ప్రజాక్షేత్రంలో ఎండగడతామని ఆయన అన్నారు. హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎం.ఆర్.సి. ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కరపత్రం ప్రతినిది ప్రతినిధి కమలాపూర్, సెప్టెంబర్ 5, హనుమకొండ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండల కేంద్రంలో ని శనివారం రోజున ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వనరుల కేంద్రం (వీ=జ), కమలాపూర్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న 10 మంది ఉత్తమ ఉపాధ్యాయులు/విద్యా సిబ్బందిని ఘనంగా సన్మానించనున్నారు.విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాలల ప్రగతి, బోధనలో నూతన పద్ధతుల అమలు మరియు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మాన కార్యక్రమానికి ప్రతిపాదించారు.




సన్మాన గ్రహీతలు:
PGHM-II, ZPHS (G), Kamalapur,
సునీత SA Maths, ZPHS (B), Kamalapur,
అన్నపూర్ణ SA Telugu, ZPHS (G), Kamalapur,
రేవతి SA Social, ZPHS (G), Uppal,
ఆకుల మల్లయ్య LFL HM, MPPS, Marripalligudem,
బత్తుల జోష్న SGT, MPPS, Bhimpally,
వెంకట రాజారా + SGT, MPUPS, Pangidipally,
రజిని SGT, MPUPS, Pangidipally,
వీరేశం PGT Telugu, TGMS, Kamalapur,
శ్రీనివాస్ CRP, ZPHS (G), Uppal, వీరు అందరూ మండల విద్యాధికారి చేతుల మీదుగా సన్మానం జరుపుకున్నారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి, మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.MRC కమలాపూర్‌లో నిర్వహించనున్న ఈ సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు విద్యా సిబ్బంది తదితరులు పాల్గొననున్నారు.

# కృష్ణవేణి పాఠశాలల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

◆ 15 ఏళ్లుగా విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులకు ఎక్సలెన్సీ సర్వీస్ అవార్డ్ తో ఘన సత్కారం

**కరపత్రం ప్రతినిది ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 05:** గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం, ఎన్టీపీసీ పరిసర ప్రాంత ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటూ విద్యారంగంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్న కృష్ణవేణి పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి వివిధ తరగతులను నిర్వహిస్తూ, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయుల బాధ్యతలను స్వయంగా నిర్వర్తించడం ద్వారా నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యత, ఆత్మవిశ్వాసం, సమయపాలన వంటి విలువలను విద్యార్థులు అనుభవపూర్వకంగా నేర్చుకున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా ఈ స్వయం పరిపాలన




దినోత్సవం ఎంతో ఆసక్తికరంగా సాగింది.

**15 ఏళ్ల సేవకు ఘన గౌరవం..**

పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో 15 సంవత్సరాలుగా తమ విలువైన సేవలను అందిస్తున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం ఎక్సలెన్సీ సర్వీస్ అవార్డు తో ఘనగా సత్కరించింది. ఈ సందర్భంగా వారికి మెమెంటోలు, శాలువాలతో సన్మానం చేసి వారి సేవలను అభినందించారు."దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే"ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీ శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ, సమాజానికి దిశానిర్దేశం చేసే ఉపాధ్యాయులను గౌరవించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు."నేటి విద్యార్థులే రేపటి పౌరులు. ఆ పౌరులను



సన్మార్గంలో నడిపించడంతో పాటు, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా, వారిలో మానవీయ విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత ఆలోచనా విధానాన్ని పెంపొందించడం ఉపాధ్యాయుల ప్రధాన కర్తవ్యం" అని అన్నారు.ఉపాధయులను సత్కరించడం గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు. పాఠశాల కరెస్పాండెంట్ శ్రీమతి మంజుల శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు."విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు, జ్ఞానం, దేశభక్తి, సేవాభావం వంటి సద్గుణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనది. ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి జీవితాన్నే కాదు... ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని, చివరకు ఒక దేశ భవిష్యత్తును మార్చగలడు" అని అన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, కృష్ణవేణి పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకోగా, విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల తమకున్న గౌరవం, అభిమానాన్ని వ్యక్తం చేశారు. పాఠశాల ప్రాంగణమంతా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు, అభినందనలు, ఆనందోత్సాహాలతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి వలన సింగరేణి దివాలా తీసే పరిస్థితి దాపురించింది

◆ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాదాసు రామ్మూర్తి, నూనె కొమరయ్య

**కరపత్రం ప్రతినిది ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 05:** కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి వలన సింగరేణి దివాలా తీసే పరిస్థితి దాపురించిందని టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకొంటి చందర్, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, ఆర్జీ వన్ ఇన్చార్జి , టీబీజీకేఎస్ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు నూనె కొమురయ్య ఆరోపించారు. కాంగ్రెస్ మోసాలు - సింగరేణి కష్టాలను వివరిస్తూ సింగరేణి వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని బిఆర్ఎస్, టీబీజీకేఎస్ పిలుపులో భాగంగా శనివారం గోదావరిఖని రెండవ గనిపై జరిగిన కార్యక్రమంలో వీరు మాట్లాడారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో సింగరేణి కార్మికులకు ఒనగోరిన ప్రయోజనము శూన్యమని ఎద్దేవా చేశారు. సింగరేణిలో కార్మిక సమస్యలు పెరిగిపోయాయని, అసెంబ్లీ సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తపరిచారు. కార్మికులకు ఇచ్చిన సొంత ఇంటి పథకం, పెర్క్ పై



ఐటి మినహాయింపు, 250 గజాల ఇంటి స్థలం లాంటి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. మెడికల్ బోర్డుని నిలిపివేశారని, డిస్మిస్ల పేరిట కార్మికుల తొలగింపు ప్రక్రియ చేపడుతుందని అన్నారు. ఉద్యోగాలు ఇస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల తొలగింపు ప్రక్రియకు చర్యలు చేపట్టిందని దుయ్యబట్టారు. సింగరేణి సంస్థలో అవినీతి రాజ్యమేలుతుందని, రాజకీయ జోక్యం మితిమీరిందని వారుఆరోపించారు. సంస్థకు రావాల్సిన 60 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యలను గాలికి వదిలేశాయని, కార్మికుల సంక్షేమం పట్టించుకోకుండా సొంత పైరవీల కోసం పాటుపడుతున్నారని విమర్శించారు. నెలకు మూడు మెడికల్ బోర్డులు ఏర్పాటు చేయాలని, నూటికి నూరు శాతం కార్మికులను అన్ఫిట్ చేయాలని కోరారు. గుర్తింపు సంఘ కాలపరిమితి పూర్తయినందున వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల పాలనపై టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు సింగరేణి వ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా జీడికే టు ఇంక్లైన్ గనిలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల ప్లకార్డులను ప్రదర్శించారు. ఆర్జి 1 ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిఅర్యస్, టీబీజీకేఎస్ నాయకులు మూల విజయ రెడ్డి, చెల్పూరి సతీష్, పోలాడే శ్రీనివాసరావు మేకల సమ్మయ్య, మారుతి, దూట శేషగిరి, ఉప్పులేటి తిరుపతి, మీస రాజు, వాసర్ల జోసెఫ్, దిడ్డి లక్ష్మణ్, అడ్డగట్ల గోపి, పర్లపల్లి అభిషేక్, నూతి రాజకుమార్, నరేష్ పటేల్, దేవేందర్, మదు, కళాదర్, జశ్వంత్ కుమార్, రవి, సందీప్, సుకుమార్, అనిల్, సమ్మయ్య, బీమార్జున్ రెడ్డి నవీన్ రావు తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**కరపత్రం ప్రతినిది వెల్దుర్తి, మాసాయిపేట ప్రతినిధి సెప్టెంబర్ 5:** వరి పొలం పనులకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా యెల్దుర్తి మండలంలోని మానేపల్లి గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. మానేపల్లి గ్రామానికి చెందిన రిక్కం శ్రీకాంత్ (30) తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో వ్యవసాయ పొలానికి వరి పొలం పనుల నిమిత్తం వెళ్లాడు. ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో పొలానికి నీరు పెట్టేందుకు మోటారు ఆన్ చేయడానికి వెళ్లిన శ్రీకాంత్‌కు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.సమాచారం అందుకున్న వెల్దుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు మృతుని భార్య అనుష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని వెల్దుర్తి పోలీసులు తెలిపారు.






# అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనుల అవినీతిపై..సీబీఐ, ఈడీ డైరెక్టర్స్ కి ఫిర్యాదు చేసిన సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య

**కరపత్రం ప్రతినిది ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 05:** రామగుండం కార్పొరేషన్ లో జరుగుతున్న అవినీతి అక్రమాల పైన సిబిఐ మరియు ఈడీకి ఫిర్యాదు చేయడం జరిగిందని సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, సిపిఐ నగర కార్యదర్శి కే.కనకరాజ్ గోదావరిఖని ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కు వచ్చిన 16 కోట్ల స్టాంపు డ్యూటీ నిధులను దారి మళ్లించి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులకు కేటాయించి వాటిని ఎవరు టెండర్ వేయకుండా ఏడుగురు కాంట్రాక్టర్లకు మాత్రమే ఆ కాంట్రాక్టులను అప్పగించి 75-77 రూపాయలకే పనిని 99 రూపాయలకు టెండర్ ఖరారు చేసి దాదాపు 22 శాతం నిధుల అవినీతికి పాల్పడడం జరిగిందని అంతేకాకుండా జరిగిన యుజిడి పనుల్లో కూడా నాణ్యత ప్రమాణాలు పాటించకుండా జరిగిన దీనిపైన చర్యలు తీసుకోకపోవడం నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సిబిఐ, అలాగే




ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ ఈడీలకు జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్టుగా తెలిపారు. రామగుండం కార్పొరేషన్ లో స్థానిక కాంట్రాక్టర్ల కడుపులు కొడుతూ ప్రతి పనిని హైదరాబాదులో ఖరారు చేసి 10 నుండి 12 శాతం కమిషన్ తీసుకొని స్థానిక ఎమ్మెల్యే హైదరాబాద్ కాంట్రాక్టర్లకు పనులు అప్పజెప్తున్నారని ధ్వజమెత్తారు. వెయ్యి రోజుల పాలనలో నీతిగా నిజాయితీగా పాలన కొనసాగిస్తున్నామని ప్రజలకు రక్షణగా ఉంటూ అభివృద్ధి చేస్తామని గొప్ప గొప్ప మాటలు చెప్పిన ఎమ్మెల్యే రామగుండంలో అత్యంత అవినీతికి పాల్పడుతున్నాడని నాయకులు ఆరోపించారు. రామగుండం కార్పొరేషన్ లో ప్రతి కాంట్రాక్టుకు ఇంత అని చెప్పి కమిషన్ ఫిక్స్ చేసిన తర్వాతనే కాంట్రాక్టులు కాంట్రాక్టర్లకు ఇవ్వడం జరుగుతుందని ఆరోపించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లో జరిగిన అవినీతే మీ నీతికి నిలువుటద్దమని వారన్నారు. రక్షకుడిగా ఉంటాను అన్న ఎమ్మెల్యే రామగుండం ప్రజలను రక్షించకున్నా దయచేసి వారిని భక్షించకండి అని కోరారు. ఈడి మరియు సిబిఐకి ఫిర్యాదు చేసిన తరుణంలో రామగుండం మున్సిపల్ కమిషనర్ ఆ ఏడు ప్యాకేజీలకు సంబంధించిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా వాళ్లను బ్లాక్లిస్టులో పెట్టాలని, నాణ్యత ప్రమాణాల పైన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, నగర నాయకులు శనిగరపు చంద్రశేఖర్, ఆసాల నవీన్, అబ్దుల్ కరీం, రాణవేణి సుధీర్ కుమార్, సాధుల శివ, పోతరాజు నాగరాజు, నాగరాజు, శనిగరపు తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో చేరిన కోర్కల్ గ్రామ సర్పంచ్,వార్డు సభ్యులు..

◆ కడుపు నింపిన కాంగ్రెస్ పార్టీకే మా మద్దతు..

◆ భారీఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరిక,ఆహ్వానించిన హుజురాబాద్ ఇంచార్జి వొడితల ప్రణవ్.

◆ 1000 రోజుల ప్రజాపాలనకు ఇదే నిదర్శనం..



**కరపత్రం ప్రతినిది ప్రతినిధి వీణవంక సెప్టెంబర్ 5**

వీణవంక మండలంలో కాంగ్రెస్ పార్టీ దూకుడు కొనసాగుతుంది.శనివారం రోజున వీణవంక మండలం కోర్కల్ గ్రామ సర్పంచ్ రమ్యకృష్ణ-అనిల్,వార్డు సభ్యులు,కుల సంఘాల అధ్యక్షులు,వివిధ పార్టీలకు చెందిన 150 మంది నాయకులు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ప్రణవ్.అనంతరం వారు మాట్లాడుతూ ఇసుక మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న మాకు సాండ్ టాక్స్ కల్పించి జీవనోపాధి కల్పించారని,కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరి వారు సంతోషంగా ఉన్నారని,ఆ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.గ్రామంలోని కొన్ని సమస్యలు ప్రణవ్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తానని తెలిపారు.

**అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తా...ప్రణవ్..**

నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని వొడితల ప్రణవ్ అన్నారు.సంక్షేమం,అభివృద్ధి రెండు ప్రధానంగా ముందుకు వెళ్తున్నామని,అధికారంలోకి వచ్చి 1000 రోజులు అయిన సందర్భంగా పార్టీలో చేరడం శుభపరిణామమని అన్నారు.కోర్కల్ గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నిధులు,కేటాయించి అభివృద్ధి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వీణవంక మండల ప్రజాప్రతినిధులు,మండల అధ్యక్షుడు,మండల నాయకులు,మైనారిటీ నాయకులు,వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ సెల్ జమ్మికుంట టౌన్ ప్రెసిడెంట్‌గా నియామకం.. కృతజ్ఞతలు తెలిపిన నూతన అధ్యక్షుడు

**కరపత్రం ప్రతినిది ప్రతినిధి జమ్మికుంట: సెప్టెంబర్ 5** హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఆశీస్సులతో తనను ఎస్సీ సెల్ జమ్మికుంట టౌన్ ప్రెసిడెంట్‌గా నియమించిన పార్టీ నాయకత్వానికి నూతన అధ్యక్షుడు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.తనపై నమ్మకం ఉంచి కీలకమైన బాధ్యతను అప్పగించిన తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్, మానకొండూరు శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణకు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం కు , కరీంనగర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు అరుణ్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు అప్పగించిన పదవి కేవలం గౌరవం మాత్రమే కాదని, పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకానికి ప్రతీక అని పేర్కొన్నారు. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రతి



ఒక్కరికీ ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు.ఎస్సీ సెల్ జమ్మికుంట టౌన్ ప్రెసిడెంట్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ఎస్సీ వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ముందుండి పనిచేస్తానని, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రతి



కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు. తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు.